పుస్తకాల సమస్య తీరినట్లే!

- జూన్ రెండో వారానికల్లా పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

యాలాల: ప్రభుత్వ పాఠశాలలకు ప్రతిసారి పాఠ్య పుస్తకాల పంపిణీ తలనొప్పిగా మారేది. పాఠశాలలు ప్రారంభమైన రెండు నెలల వరకు పూర్తిస్థాయిలో పుస్తకాలు రాక, నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఈ విద్యా సంవత్సరంలో దాదాపు అన్ని పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాల అందడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యాలాల మండలంలో మొత్తం 10 ఉన్నత పాఠశాలలు, 48 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 6500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా పాఠ్యపుస్తకాల పంపిణీ సకాలంలో జరగడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూడు విడతలో ఆయా పాఠశాలలకు 33వేల పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా, సుమారు 32 వేలకు పైగా పాఠ్యపుస్తకాలు ఆయా పాఠశాలలకు చేరాయి. ప్రతి ఏడాది ఏదో ఒక కారణంతో పాఠ్యపుస్తకాల పంపిణీ ఆలస్యమయ్యేది. కానీ ఈ ఏడాది విద్యాశాఖ ఉన్నతాధికారుల ముందు చూపుతో పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తిస్థాయిలో జరిగిందని ఎంఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపించేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకా అడ్మిషన్లు జరుగుతున్నాయని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న క్లస్టర్ ఇంచార్జీలు

నాణ్యమైన పాఠ్యపుస్తకాలు !

ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాల నాణ్యత ఎంతో ఉన్నతంగా ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. గతంలో పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాల ప్రింటింగ్, అక్షరాల స్పష్టత, తక్కువ ఆకర్షణీయత లాంటి సమస్యలు ఉండేవని కానీ, ఈ సారి ఆ సమస్య ఎక్కడ కనిపించడం లేదని తెలిపారు.

పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాల పంపిణీ



ఈ ఏడాది మండలంలోని అన్ని పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాల పంపిణీ జరిగింది. సకాలంలో అన్ని పాఠశాలలకు పుస్తకాల సరఫరా చేశాం. అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన విషయమై అవగాహన కార్యక్రమాలు, బడిబాటలో చేపట్టడం జరిగింది.

– సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ యాలాల

రైతుల ఆర్థిక ఎదుగుదలే లక్ష్యం

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: రైతులు ఆర్థికంగా బాగుపడాలనే సంకల్పంతోనే సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఆర్థికంగా సహకరిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేయడం జరుగుతుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతులకు గోడ గడియారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘ బ్యాంకుల ద్వారా అధికంగా రుణాలను అందించి వారికి ఆర్థికంగా చేయూతనందిస్తున్నామని పేర్కొన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి నష్టాల్లో ఉన్న సహకార సంఘం బ్యాంకులను లాభాల్లోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందించడంతో పాటుగా అనుబంధ రంగాలైన పౌల్ట్రీ, రైస్‌మిల్స్‌లకు రుణాలను అందించామన్నారు. అలాగే, వాణిజ్య బ్యాంకులకు దీటుగా బంగారంపై రుణాలు, విద్యార్థులకు ఎడ్యుకేషన్ లోన్స్, స్థిర,చర ఆస్తులపై రుణాలను అందిస్తూ సహకార సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, పీఏపీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, చౌడాపూర్ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి , ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాంలాల్, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, సొసైటీ డైరెక్టర్ నర్సింలు, రత్నమ్మ, కొండయ్య, రాజప్ప పాల్గొన్నారు.



రైతులకు గడియారాలను అందజేస్తున్న మనోహర్ రెడ్డి

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఎస్‌ఐ సత్యనారాయణరాజు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బంట్వారం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి ఎస్‌ఐ సత్యనారాయణరాజు అన్నారు. బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో సైబర్ క్రైంపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ వ్యక్తిగత సమాచారం కొత్త వారు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పొద్దన్నారు. ముఖ్యంగా బ్యాంక్ అకౌంట్ ,ఆధార్ కార్డు నంబర్ , ఓటీపీలు ఇతరులకు చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ అంబదాస్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన పెట్రోల్ బంకులు



బారులు తీరిన ద్విచక్ర వాహనదారులు

యాలాల: మండలంలోని పలు పెట్రోల్ బంకులు బైకులతో కిటకిటలాడాయి. బుధవారం ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలో పీఎంఆర్ క్రీడా ముగింపు ఉత్సవాల్లో భాగంగా బైక్ ర్యాలీని నిర్వహించారు. దీంతో యాలాల మండలం నుంచి పట్నం అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా రసూల్‌పూర్, తాండూరు పట్టణ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గల బంకుల వద్దకు బైకులు బారులు తీరాయి. ర్యాలీలో పాల్గొనే అభిమానులు, కార్యకర్తల బైకుల్లో పెట్రోల్ ఉచితంగా పోయించారు.దీంతో ఆయా పెట్రోల్ బంకుల వద్ద భారీగా ద్విచక్రవాహనాలు బారులు తీరాయి.

ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

అనంతగిరి: అనంతగిరిగుట్ట అనంతపద్మనాభ స్వామి ఆలయ ఆషాఢ మాస చిన్నజాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం ముందు ధ్వజారోహణ చేసి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ ట్రస్టీ పద్మనాభం తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాగుపై వంతెన నిర్మించాలి

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని మల్‌శెట్టిపల్లి తండా వాగుపై వంతెన నిర్మించాలని తండావాసులు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో వాగు పారితే తండాకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని చెప్పారు. సమస్యను చాలా కాలంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

పండుగలు మతసామరస్యానికి ప్రతీకలు

ఎస్‌ఐ సంతోష్‌కుమార్

ధారూరు: నేడు (గురువారం) జరగనున్న బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు మతసమరస్యంతో జరుపుకోవాలని ధారూరు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. శాంతియుత వాతావరణంలో, సోదరభావంతో పండుగలు జరుపుకోవాలని సూచించారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా వ్యర్థ పదార్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు. వాటిని ప్లాస్టిక్ కవర్లు, ఇతర బ్యాగుల్లో వేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో వేయాలని ఆయన సూచించారు. ఏలాంటి గొడవలు, కొట్లాటలు లేకుండా హిందూ, ముస్లిం సోదరులు మెలగాలని ఆయన పేర్కొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నిక

దోమ : పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్ల ఎన్నికల్లో బుధవారం అధికార పార్టీకి చెందిన వార్ల లలిత, కాంగ్రెస్ పార్టీకి చెందిన కావాలి నరేశ్ గెలుపొందారు. దీంతో ఆయా పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ లక్ష్మయ్య ముదిరాజ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ గొల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు మాలి రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందరి చూపు కాంగ్రెస్ వైపే

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: రాష్ట్రంలోని ప్రజలందరు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హల్‌లో మోమిన్‌పేట, టేకులపల్లి, మొరంగపల్లి, రావులపల్లి గ్రామాల్లోని బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకూ బీఆర్‌ఎస్ పార్టీ గ్రాఫ్ పడిపోతుందన్నారు. కుటుంబ పాలనలో అవినీతి పెరిగిపోతుందని చెప్పారు. నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఎకరాలు, రైతులకు రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, నాయకులు శుభాష్‌గౌడు, మాణయ్య, సురేందర్, సిరాజోద్దీన్, మహేందర్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.



మోమిన్‌పేట: మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

బీఆర్‌ఎస్ నాయకులవన్నీ డొల్ల ముచ్చట్లే



కేంద్ర పథకాలను వివరిస్తున్న మారుతి కిరణ్

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్న వన్నీ డొల్లమాటలేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం చాకల్‌పల్లిలో మహాజన్ సంపర్క్ యాత్రలో భాగంగా చౌడాపూర్ బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బంధయ్య ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర పథకాలకు పేర్లు మార్చి సీఎం కేసీఆర్ తన ఫొటోలతో గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రం పథకాలను ప్రజలకు అందకుండా చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం ప్రభుత్వం అవలంబిస్తున్న నియంతృత్వ పోకడలకు ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్‌కుమార్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రామాంజనేయులు, మల్లికార్జున్, రమేష్, మహేష్, పాల్గొన్నారు.

పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని వినతి

అనంతగిరి: ధారూర్ మండలం పీసీఎం తండాల పరిధిలోని శేరిగడ్డ, జీడిగడ్డతండాల గ్రామస్తులకు పోడు పట్టాలు ఇవ్వాలని పలువురు నాయకులు ఆర్డీఓను కోరారు. బుధవారం బాధిత రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు అటవీ శాఖ అధికారుల అడ్డంకులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంలో వెంటనే సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యా మౌలిక వసతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, జిల్లా నాయకులు వడ్లనందు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు, నాయకులు

ప్రభుత్వాన్ని బద్నాం చేయొద్దు

- అధికారులు, రైతులను ఇబ్బంది పెడితే చర్యలు
- జెడ్పీటీసి నాగిరెడ్డి ఆగ్రహం
- సమస్యల పరిష్కారంలో మళ్లీ బహిర్గతమైన వర్గపోరు

దోమ: అధికారులు ప్రభుత్వాన్ని బద్నాం చేసే కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ అనసూయ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమైయ్యారని మండిపడ్డారు. రైతులు పండించిన ధాన్యాలను మిల్లులకు తరలిస్తున్నప్పటికీ సంబంధిత మిల్లుల యజమానులు అధికారులతో కుమ్మక్కై రైతులను మోసం చేశారని ఆరోపించారు. సంబంధిత అధికారులు ఈ విషయం తెలిసినప్పటికీ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ సురేశ్

మీసేవాల్లో మోసాలు!

ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల సాయంతో పాటు ఇతర పనుల విషయంలో మీసేవ యజమానులు అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని సభ్యులు మండిపడ్డారు. వెంటనే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల సర్పంచులు డిమాండ్ చేశారు. స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ ప్రతి మీసేవాకు సర్క్యులర్ జారీ చేస్తామని తెలిపారు.

బహిర్గతమైన వర్గపోరు?

ఎంపీపీ అనసూయ అధ్యక్షతన నిర్వహించి సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీకి చెందిన నేతల మధ్య వర్గపోరు బహిర్గతమయింది. బొంపల్లి అంగన్వాడీ పోస్టు విషయంలో సర్పంచ్ కోళ్ల సురేశ్ ఎంపీటీసీ రాములు మధ్య వర్గ పోరు బట్టబయిలైంది. సర్పంచ్ కోళ్ల సురేశ్ గ్రామంలో ఉన్న అంగన్వాడీ పోస్టును రాజకీయం చేస్తూ బీఎమ్మార్, కేఎమ్మార్ అనే నినాదంతో రాజకీయానికి తెరలేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ రాములు జోక్యం చేసుకోని బీఎమ్మార్, కేఎమ్మార్ అనే నినాదాలు అధికారుల దగ్గర ఉండవని, అంగన్వాడీ పోస్టు విషయంలో ఏ అధికారి రాజకీయం చేయడం లేదని మండిపడ్డారు. వెంటనే స్పందించిన సంబంధిత అధికారులు ఉన్నతాధికారుల ఆదేశానుసారం అంగన్వాడీ పోస్టును నిలిపివేశామని, మళ్లీ గ్రామంలో టీచర్ భర్తీ కోసం నూతన నోటిఫికేషన్ వేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, ఎంపీపీ అనసూయ, పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ విజయేందర్, ఎంపీడీఓ జయరాం, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారుల, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు

వికారాబాద్ అర్బన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ప్రవేశాలకు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయిలో జూలై 1 నుంచి 5 వరకు మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఉంటుందన్నారు. మండలస్థాయిలో ఎంపికైన వారికి జిల్లాస్థాయిలో 13న, 4వ తరగతి బాలబాలికలకు, 14న 5వ తరగతి బాలబాలికలకు బ్లాక్ గ్రౌండ్ వికారాబాద్‌లో ఎంపికలు ఉంటాయన్నారు. ఆ రోజు ఉదయం 8గంటలోపు రిపోర్ట్ చేయాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి 27, 28 నాడు స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్‌లో రాష్ట్రస్థాయి ఎంపిక ఉంటుందన్నారు. విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్ , జనన ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, 3వ తరగతి, 4వ తరగతి ప్రొగ్రెస్ రిపోర్ట్, నాలుగు ఫొటోలతో హాజరు కావాలన్నారు.

పిల్లలను హింసిస్తే చట్టపరమైన చర్యలు

సాధన స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మురళీమోహన్

ధారూరు: విద్యా హక్కు చట్టం ప్రకారం పిల్లలను హింసించరాదని సాధన స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ చిక్కు మురళీమోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. ధారూరు మండలంలోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లు, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులతో ధారూరులోని బీసీ వసతిగృహం ఆవరణలో బుధవారం క్లస్టర్ స్థాయి కెపాసిటి బిల్డింగ్ ట్రెనింగ్ ద్వారా బాలల హక్కులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ప్రణాళికను తయారు చేసుకోవాలని, బడి బయట పిల్లల్ని సమీప పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. తరుచూ విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన సమావేశాలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. బాల్యంలో పెళ్లిళ్లు చేయడం సరికాదని, ఏమి తెలియని చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. అవగాహన లేక కొందరు తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తుంటారని అన్నారు. బాల్యవివాహాలు చేస్తున్న సమయంలో అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు నెల్లి జనార్దన్, గ్రామ సర్పంచు చంద్రమౌళి, రిసోర్స్ పర్సన్ శ్రీరామ్, సాధన సంస్థ కోఆర్డినేటర్ రమేశ్, సిబ్బంది అంజయ్య, మమత, శివలక్ష్మి, అసిమా, కన్యాకుమారీ, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్

సంక్షిప్త వార్తలు

యువకుడి ఉదారత

బషీరాబాద్: మండలంలోని బహదూర్‌పూర్‌లో ఓ యువకుడు ఉదారతను చాటుకున్నాడు. గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు బుధవారం పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, వాటర్ బాటిల్స్ అందజేశారు. చిన్నారులకు చదువుకోవడానికి తన వంతు సహకారం చేస్తానని చెప్పాడు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహ్మారెడ్డి, గ్రామ సర్పంచ్ సుభాష్, ఉపాధ్యాయుడు, శ్రీనివాస్, గ్రామస్తులు మునీందర్ సాయిలు, యాదయ్య పాల్గొన్నారు.

రూ. లక్ష సాయానికి 710 దరఖాస్తులు

తాండూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బీసీలకు ఆర్థిక సాయానికి సంబంధించి మండలంలో 710 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసు కున్న వారు స్థానికంగా ఉండాలన్నారు. కులవృత్తి చేస్తున్నవారికే ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

తాండూరు రూరల్: కోత్లాపూర్ రేణుక ఎల్లమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. మే 5వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు నెల రోజుల పాటు జాతర జరిగింది. ఈ జాతరకు కర్ణాటక, ,మహారాష్ట్రతో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా భక్తులు హుండీలో వెసిన కట్నకానులను బుధవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. రూ.4 లక్షల 71 వేల 245 రూపాయాల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ సందీప్‌రెడ్డి, ఈఓ శేఖర్‌గౌడ్‌లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిలు, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్రాంరెడ్డి, సభ్యులు రాజు, మొగులప్ప ,సురేష్ ,పద్మమ్మ , వెంకటప్ప, శ్యామలీలతో పాటు నాయకులు ప్రదీప్ రెడ్డి, బంటు నర్సింలు,అర్చకులు శ్రీనివాస్‌లు ఉన్నారు.

కండక్టర్ లక్ష్మణ్ మృతి బాధాకరం

తాండూరు టౌన్: ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన తాండూరు ఆర్టీసి డిపో కండక్టర్ లక్ష్మణ్ మృతి విచారకరమని పలు పార్టీలు, కార్మిక సంఘాల నేతలు అన్నారు. ఈనెల 22వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై బుధవారం ఆస్పత్రిలో ఆయన మృతి చెందాడు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసి తాండూరు డివిజన్ కార్యదర్శి పి శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్, టీజేఎస్ కౌన్సిలర్ సోమశేఖర్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె శ్రీనివాస్‌లు ఓ ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తాండూరులో 17 పరీక్ష కేంద్రాలు

తాండూరు రూరల్: పట్టణంలో గ్రూప్–4కు సంబంధించి 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు బుధవారం ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. పట్టణం, పట్టణ శివారులో ఉన్న పాఠశాలలు, కళాశాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జూలై 1వ తేదీన శనివారం పరీక్ష ఉంటుందన్నారు.

గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

వికారాబాద్ అర్బన్: జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయ, అధ్యాపకులుగా 2023–24 విద్యా సంవత్సరానికి తాత్కాలిక పద్ధతిలో పనిచేయుటకు అర్హతలు కలిగిన ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ పి.ఎస్.కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం సంబంధిత గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల పరిగిలో జూలై 6వ తేదీ సాయంత్రం 4గంటల్లోపు అందించాలన్నారు. దరఖాస్తుదారులు డెమో, ఇంటర్వ్యూలకు జూలై 7 ఉదయం 9గంటలకు టీటీడబ్ల్యూ ఆర్‌ఐటీ సెంటర్ మానస హిల్స్, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా నందు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. బాలికల విద్యాలయాల్లో మహిళలకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8333925364ను సంప్రదించాలన్నారు.

ఘనంగా పోచమ్మకు బోనాలు

ధారూరు: ధారూరు మండలంలోని నాగసమందర్‌లో బుధవారం సాయంత్రం పోచమ్మ తల్లి బోనాల జాతరను నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా బయలుదేరారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. పోచమ్మ గుడి వద్దకు బోనాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి చుట్టు 5 ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత

బషీరాబాద్: మండలంలోని నీళ్లపల్లిలో ఓ పేద విద్యార్థినికి ఏకాంబరి ఆలయ ట్రస్టు సభ్యులు చేయూత అందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ గురుకుల ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైభవి తండ్రి పరుశురాంకి ట్రస్టు సభ్యులు, గ్రామ సర్పంచ్ సువర్ణ బుధవారం రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. ప్రతిభకు పేదరికం అడ్డురాకూడదని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరన్‌కోట్ హెచ్‌ఎంగా శ్రీనివాస్‌గౌడ్

తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. బుధవారం ఎంఈఓ వెంకటయ్య శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు. గతంలో పని చేసిన హెచ్‌ఎం లక్ష్మయ్య అనారోగ్య సమస్యల కారణంగా తప్పుకున్నట్లు తె లుస్తోంది. అయితే పాఠశాల్లో ఆరుమంది సీనియర్ ఉపాధ్యాయులు ఉన్న కూడా హెచ్‌ఎం బాధ్యతలకు ససేమేరా అనడంతో శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించినట్లు ఎంఈఓ తెలిపారు.

ఉచిత కంది విత్తనాలతో ప్రయోజనం

దోమ: ప్రభుత్వం అందించే ఉచిత కంది విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల రైతులకు ప్రభుత్వం అందించే ఉచిత కంది విత్తనాలను ఏవో ప్రభాకర్‌రావుతో కలసి అందజేశారు. వారు మాట్లాడుతూ..రైతులు కంది విత్తనాలను వినియోగించుకోని అధిక లాభాలను పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిరంతర కృషి

కుల్కచర్ల: గ్రామపంచాయతీ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నట్లు గోగ్యానాయక్ తండా సర్పంచ్ రవి, మండల కోఆప్షన్ సభ్యులు జుబేర్ మహ్మద్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలంలోని గోగ్యానాయక్ తండా పంచాయతీ పరిధిలో మండల పరిషత్ నిధులు రూ.5లక్షలతో నూతనంగా బోర్లు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరు అందక కొన్ని గిరిజన ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవద్దనే నూతనంగా బోర్లు వేయించామన్నారు. కార్యక్రమంలో చందర్, లింగ్యా, బాల్యానాయక్, శంకర్, పెంట్యానాయక్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

యాలాల: మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో బుధవారం నోట్‌బుక్కులు, కార్పెట్స్‌తో పాటు ఇతర నిత్యావసర వస్తువులను వసతి గృహ హెచ్‌డబ్ల్యూఓ భాగ్యలక్ష్మి, మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి బాలికలకు పంపిణీ చేశారు. వెనకబడిన తరగతుల శాఖ నుంచి నోట్ పుస్తకాలు, రికార్డులు, బెడ్‌షీట్స్, గ్లాసులు అందజేసినట్లు తెలిపా రు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓ తెలిపారు.

హరితహారానికి సిద్ధం కండి: ఎంపీడీఓ

మర్పల్లి: హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేయాలని ఎంపీడీఓ రాజ్ మల్లయ్య పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులతో హరితహారం, శానిటేషన్, పల్లెప్రగతిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురవగానే మొక్కలు నాటేందుకు ప్రతి గ్రామంలో ఇచ్చిన టార్గెట్ ప్రకారం గుంతలు తీయించాలన్నారు. ఈ సంవత్సరం మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 1.50 లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేష్, సూపరింటెండెంట్ కృష్ణకుమార్, ఏపీఓ అంజిరెడ్డి, ఏపీఎం పోచయ్య ఆయా పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.